# త్రివేణీ సంగమం

మోసుకపల్లి లక్ష్మీనరసింహశాస్త్రి

నేను అలహాబాదు వెళ్ళటానికి కారణం ఏమయినప్పటికీ ఇటార్సీ స్టేషన్లో నాలుగు గంటలు ఆగటానికి కారణం మాత్రం, కాశీ ఎక్స్‌ప్రెస్ లేటవటమే !

వెయిటింగ్ రూంలోకి వెళ్లి కుర్చీలో చేరగిలపడ్డాను. అసలే ప్రయాణం అలసట. అంతకంటె మానసిక ఆందోళన ఎక్కువగా వుంది. కళ్లు తెరుచుకునివుంటే కనిపించనవన్నీ కళ్లు మూసుకోగానే కనిపిస్తున్నాయి. అందుకనే కళ్లు తెరుచుకునే వచ్చేపోయే బాటసార్లను చూస్తూ కూర్చున్నాను. ఇంతలోకి క్షణంలో బొర్ర మీసాలయన పెద్ద శరీరాన్ని మెల్లిగా ఈడ్చుకుంటూ నా దగ్గరకు వచ్చి నిలబడ్డాడు. ఓ పుస్తకం, పెన్సిలు నా ఎదురుగాఉన్న గుండ్రని బల్లమీద పెట్టి, 'ఎక్కడి నుంచి రాక, వెళ్లేదెక్కడికి, టిక్కెట్టు నంబరు, పేరు వగైరాలు రాయమని హిందీలో అన్నాడు.' నేను రాయంగానే సాల్యూట్ చేశాడు, నా వైపు అతి వినయంగా చూస్తూ. దీని అంతరార్థం అందరికీ తెలుసు !

ఈ జీవితమే పెద్ద రైలు. ప్రతి ప్రయాణికుడు తాను దిగాల్సిన స్టేషను రాగానే దిగిపోతాడు. ఈ నాలుగు రోజుల భాగ్యానికి ద్వేషాలు అసూయలు యెందుకు ? మానవులంతా ఒక్కటే ! అనే గీతం హిందీలో పాడుకుంటూ కాషాయి వస్త్రాలు కట్టుకున్న వ్యక్తి ఆ వెయిటింగ్‌రూమంతాతిరుగుతున్నాడు. స్మశాన వైరాగ్యం అంటిపెట్టుకున్న నాకు, ఆ గీతంలో ఎంతో అర్థం స్ఫురిస్తోంది. మనస్సు వికలమయి పోయింది. ఆ గీతాన్ని వింటూ ఆయన వంకే చూస్తున్నాను.

'ధర్మం వెయ్యండి మీకు భగవంతుడు మేలు చేకూరుస్తాడు...ధర్మం వెయ్యక పోయినా మీకు భగవంతుడు మేలు చేకూర్చాలనే కోరుకుంటాను' అన్నాడు ఆ సాధువు స్వచ్ఛమైన హిందీభాషలో. మొట్టమొదటి మాటకు మెదలకుండా వూరుకున్న ప్రయాణికులు రెండో వాక్యం వినపడంగానే జేబుల్లోకి చేతులు పోనిచ్చారు. నేనూ ఓ ప్రయణీకున్నేగా!

వెయిటింగ్‌రూము ద్వారం ముందర ఓ స్టూల్‌మీద తాపీగా కూర్చుని ఆ బుర్రమీసాలాయన లోపలికి బయటకు వెళ్లే ప్రయాణీకులను సోదా చేస్తు న్నట్టుగా చూస్తున్నాడు.

ఎక్కడినుంచో ఓ రైలు వచ్చేసి కర్కశంగా చప్పుడుచేస్తూ చప్పున ఆగి పోయింది. ఇట్టే ప్లాట్‌ఫారం అంతా జనంతో నిండిపోయింది. వెయిటింగ్ రూములో ఖాళీఅయిన కుర్చీలు భర్తీ అయిపోయినాయి. మళ్ళీ రూమంతా కిటకిట లాడిపోతోంది ఆ లావుపాటి మనిషి తొణక్కుండా అట్లాగే నింపాదిగా ప్రతి ప్రయాణీకుని దగ్గరకొచ్చి పుస్తకాన్ని నింపేస్తున్నాడు.

నేను మూలగా కుర్చీలో కొంచెం ఏటవాలుగా కూర్చున్నాను. అస్తమిస్తున్న సూర్యుడు కిరణాల్ని చిందరవందరగా ప్రసరింపచేస్తున్నాడు. ఓ సూర్యకిరణం కిటికీలోంచి దూసుకుని వచ్చి చప్పున నా కంట్లో పొడిచింది. కనురెప్పలు టపటప మని పిస్తూ, మొహం చిట్లించుకుంటూ కొంచెంగా తలెత్తి చూశాను. ఒకమ్మాయి ఓ సూటుకేసు పట్టుకుని హాండ్‌బాగ్‌ను చేతికి లూజ్‌గా తగిలించుకుని చకచకా ప్లాటుఫారం మీదనుంచి 'మా' వెయిటింగ్ రూములోకి వస్తున్నట్టు చూశాను. ఆమె నడక స్పీడ్ చూస్తుంటే గాభరా పుట్టి నట్టయింది. చప్పున వళ్ళు గలతరిం చింది. కళ్ళు బాగా తెరిచి వింతగా చూస్తున్నాను. క్షణంలో వెయిటింగ్ రూములోకి వచ్చిపడింది. ఆమె కళ్ళు చక్రాల్లా తిరుగుతూ రూమంతా గాలిం చేసినాయి. ఆ అమ్మాయి కళ్ళు యిట్టే నిలిచిపోయినాయి. నావంక చూస్తున్న ట్లనిపించింది. అనిపించట మేమిటి, నా దగ్గరకే తుఫానులాగ వచ్చేసింది కూడ. నేను గతుక్కుమన్నాను. ఉక్కిరిబిక్కి రయినట్టనిపించింది. అందులో ఆడ వాళ్ళంటే అసలే భయం నాకు.

'ఎక్స్‌క్యూజ్ మీ !......వేరార్యూ గోయింగ్ ?......' అతి నాజూకుగా అడిగింది.

'అలహాబాద్ !......' అక్షరాలు విడదీసి అన్నాను.

'ఓ...' కళ్ళు పెద్దవి చేసి తల పైకెత్తి కాళ్ల బొటనవేళ్లమీద నిలబడింది. ఆ సంతోషాన్ని చూస్తుంటే చప్పట్లు కొట్టి డాన్స్ చేస్తుందేమో అనిపించింది.



ఇంకా నయం యెందుకు వెళుతున్నారని అడిగిందికాదు. కారణమేమిటో చెపితే మూర్ఛపోయేది.

'అయా మాల్సో గోయింగ్ టు అలహాబాద్ !......' ఇంత మొహం చేసుకుంది.

'అయితే యేమిటి!...'అనుకున్నాను మనసులో. సూట్ కేసు అక్కడ పెట్టేసింది.

'ఊళ్లోకి వెళ్ళి యిప్పుడే వచ్చేస్తాను. ఈ సూట్ కేసు చూడండి కాస్త, ప్లీజ్! ప్రాధేయపడ్డట్టుగా రిక్వెస్ట్ చేసింది ఇంగ్లీషు భాషలో.

ఇంకా నా నోటివెంట మాట రాక మునుపే గిర్రున వెనక్కు తిరిగి ముందుకు సాగిపోయింది.

నా నిజాయితీమీద ఆ అమ్మాయికి అంత నమ్మకం యెందుకు కలిగిందో నాకు తెలీదు. ఆ సూట్ కేసుని కాపలా కాయాల్సిన అవసరం నా కేమిటో అంతకంటే అర్థంకాలేదు. కాసేపు తటపటాయించి సమాధానపడ్డాను. మెల్లిగా దాన్ని నా కుర్చీ వెనక్కులాగి దానిమీద నా బాగ్, యింకో పాత సంచీని పెట్టాను. ఎట్లాగయినా నా సామాను యింకొకరికి అప్పగించి అటూ యిటూ వెళ్ళే పరిస్థితి కాదు. ఈ సూట్ కేసు యిక్కడుంటే నాకేం నష్టంలే అనుకున్నాను.

మెరుపులాగ ఆ అమ్మాయి యిట్టే వచ్చిపడింది మళ్ళీ. నావంక చూస్తూ మొహం వెడల్పుచేసి చిరునవ్వుతో 'సారీ' అంటూ సూట్ కేసు తాళం తీసింది. లోపల ఏవో ఫిల్మ్ మాగజైన్లు కనిపించాయి. బట్టలడుగునుంచి ఓ గాజు తీసి చేతికి వేసుకుంది. నాకు చూపించింది, ఆ గాజు తీసుకోవటానికి వచ్చినట్టు నేను తెలుసుకోవాలని. అంత బింకంగా ఉండటం సభ్యత కాదేమోనని 'ఓ ఐ సీ...' అన్నాను, ఆమె చిరునవ్వుకు రెస్పాన్స్‌గా. పెట్టెమూత సొరుగులోంచి రెండు ఫోటోలు క్రింద పడ్డాయి. నేను చూడకూడనివి చూశాను. ఇహ ఒకసారి చూసింతరువాత కళ్ళు గట్టిగా మూసుకున్నా ఒకటే తెరిచినా ఒకటే ! నావంక ఓరకంటితో సిగ్గును అభినయిస్తూ చూస్తూ, మెల్లిగా చేత్తో ఆ ఫోటోల్ని బట్టచాటు చేసుకుని పైకి తీసి ఆ పెట్టెలో కుక్కేసింది. గభాలున తాళంవేసి, నిటారుగా నిలబడి చక చక ముందుకు సాగిపోయింది.

నా మనస్సంతా గజిబిజయిపోయింది. పవిత్రమైన కార్యానికి దీక్షగా నేను బయలుదేరట మేమిటి, యీ అమ్మా యెవరో వచ్చి నా మూడ్ అంతా చెడగొట్టట మేమిటి ? అసలు నేను మొదట్లోనే చెప్పాల్సింది నీ పెట్టె కాపలాకోసం యిక్కడ కూర్చోలేదని. ఇప్పు డేమనుకుంటే యేం లాభం !

చాలాసేపు కుర్చీలో కూర్చోటం వలన కాళ్ళు పీక్కుపోతున్నాయి. వెయిటింగ్ మహా కష్టం, దేనికోసమో నిరీక్షిస్తూ కూర్చోటం సహించరానిది. మూడు గంటలు కూర్చున్నా యేమనిపించలేదుగాని యింకా గంట ఆగాలనేటప్పటికి మహా చిరాకుగా వుంది. బద్ధకంగా లేచి నిలబడ్డాను. కాళ్ళు తిమ్మిర్లు యెక్కినాయి. కాళ్ళు విదిలించేసి, సామాన్లు భద్రంగా కుర్చీ ప్రక్కకు నెట్టేసి మాటిమాటికి వెనక్కు వెనక్కు చూస్తూ, ఎదురుగావున్న టీ స్టాల్ దగ్గరకు వెళ్లాను.

నా సామాను 'ఆ' సామాను ఓ కంట కనిపెడుతూనేవున్నా. టీ తాగుతున్నాను. టైము చూసుకున్నాను. అలహాబాద్ బండి వచ్చే వేళ అవుతుంది. ఆ అమ్మాయి వచ్చే వేళ కూడా అవుతోంది. వస్తే యేంలే, రానీ, అయినా నాకెందుకు నా మనస్సులో చెలరేగిన ప్రశ్నలు యేవీ కూడా అడగదల్చుకోలేదు.

ఆ ప్రశ్నలకు సమాధానాలు దొరక్కపోయినా నాకేమీ దిగులు లేదు. నా కెవ్వరూ లేరు. నేను ఒంటరిగానే ప్రయాణం చేస్తున్నాను అని ఓ ప్రశ్నకు ఆమెగారు సమాధానం చెప్పినా, నాకు ఒరిగిపడే దేమీలేదు. నా కెవ్వరూ లేరు, మీతోనే వస్తానంటూ కూర్చుంటే అది మహా ప్రమాదం. మనం మెదలకుండా ఊరుకోవటం చాలా ఉత్తమం. ఆమె యేదైనా అవకతవకగా ప్రశ్నలేస్తే చలాకీగా సమాధానం యిచ్చే పరిస్థితుల్లో లేనే లేను. అలాంటపుడు యెందుకొచ్చిన

మథన అని నాలో నేనే కొన్ని ప్రశ్నలు, వాటికి మోడల్ ఆన్సర్సు అన్నిటినీ కూడ బలుక్కుని మెదలకుండా వూరుకున్నాను.

నేను యెక్కడెకెక్కడికో వూహల్లోకి పోయి మళ్లీ వెయిటింగ్‌రూము దగ్గరకు తిరిగి వచ్చేటప్పటికి, ఓ కానిస్టేబుల్, ఓ సబ్‌ఇన్‌స్పెక్టరు ఎక్కడెక్కడ తిరిగి వస్తున్నారోయేమో, వెయిటింగ్ రూమ్‌లోకి ప్రవేశించారు. వాళ్ళు యెక్కడికి పోతున్నారో ఓ కంట కనిపెడుతూనేవున్నా. ఒక్కసారి యిద్దరూ గిర్రున తిరిగారు. వెయిటింగ్ రూమంతా వాళ్ల కళ్లకు కట్టేసినట్టయిపోయింది. ఎవరినో ఒకర్నిద్దర్ని ఏవో ప్రశ్నలు వేస్తున్నట్టున్నారు. వాళ్ళు చెప్పిన సమాధానాలు విని మెదలకండ వూరుకున్నారు. తీరా వెళ్లి వెళ్లి నేను కూర్చున్న కుర్చీ దగ్గర నిలబడ్డారు. వాళ్ల కళ్లు ఆ సూట్‌కేసుమీద పడ్డట్టున్నాయి. వెంటనే ఆ పోలీసు ఆ సూటుకేసును యివతలకుతీసి తిరిగేసి బోర్లేసి పరీక్షచేస్తున్నాడు. పక్కనవాళ్లను అడిగినట్టున్నాడు, వాళ్ల సమాధానం చెప్పివుంటారు యివి మావి కావని. అయితే యివి యెవరివి, వాళ్లెక్కడికెళ్ళారు అని అడిగివుంటారు. మాకు తెలీదని సమాధానం చెప్పి వుంటారు. అందుకనే 'సబ్‌ఇన్‌స్పెక్టరు తల వూపుతూ వెనక్కు తిరిగాడు. ఇప్పుడే ఒకాయన వాకిట్లోకి వెళ్ళాడని చెప్పివుంటారు కూడా. లేకపోతే పోలీసు ఎంతసేపయిందని చెయ్యి వూపుతూ అడిగే సావకాశం లేదు. ఇక నేను సూటిగా వెళ్లటమా అక్కడే కాసేపు ఆగిపోవటమా అనే సందిగ్ధంలోపడ్డాను. వాళ్లు అక్కడినుంచి కదలటం లేదు. నేను యిక్కడినుంచి మెదలటం లేదు. ఏమనుకున్నారోయేమో క్షణంలో యిద్దరూ బయటకు వచ్చేశారు. వాళ్ళు ప్లాట్‌ఫారం చివరి



దాకా వెళ్లేటంతవరకు చూసి మరీ తిరిగి 'నా' కుర్చీలోకి వచ్చి కూర్చున్నా; అమ్మయ్య అనుకుంటూ.

నలుగురూ నావైపు సస్పిషస్‌గా చూడడం మొదలుపెట్టారు వాళ్లను గమనించనట్లుగా నటించటానికి ప్రయత్నం చేశా. అందులో ఒకాయన ఏదో చెప్పబోతున్నట్టుగా ముందుకు ఒరిగి నావైపు చూడటానికి ప్రయత్నం చేశాడు.

'పోలీసులు యీ సూటుకేసును తనిఖీ చేశారు...' అన్నాడు నా కంటె అద్వాన్నంగా హిందీలో.

'ఆ అమ్మాయెవరో వచ్చి యీ సూటుకేసు నా దగ్గర పెట్టిపోయింది మీరూ చూశారు గదా' అని అందామనుకున్నా కాని మళ్ళీ పస్తాయించా. ఆయన అన్న మాటలు వినిపించుకోకుండా వున్నట్టుగానే ప్రవర్తించా.

ప్రక్కనె ఒక మగాయనతో బెంగాలీ భాషలో యేదో చెపుతుంది. నాకు పూర్తిగా అర్థంకాకపోయినా, నా విషయమే అని మాత్రం స్పష్టంగా తెలుసుకున్నాను. నా వెనకాల యెవరో లొడ లొడ అరవంలో మాట్లాడుతున్నారు. నేను వెనక్కు తిరగంగానే చప్పున ఆపేశారు. ఇదికూడా అదే బాపతు అనుకున్నా. అందిరి కళ్లూ ఒక్కసారిగా వెయిటింగ్‌రూము ద్వారం వైపు తిరిగినాయి. నేను యిట్టే అటు వైపే చూశాను. 'ఆ సబ్‌ఇన్స్‌స్పెక్టర్, ఆ కాన్‌స్టేబుల్ !' ఇద్దరూ సూటిగా నావైపే వస్తున్నారు


'వస్తూ వస్తూనే సూటుకేసు తాళం తియ్యండి...' అని జబర్దస్తీగా అన్నాడు సబ్‌ఇన్స్‌స్పెక్టరు.

'ఇది నాది కాదు......'అన్నాను యింగ్లీషులోనే.

'ఫిర్ కిస్కా హై !......' ఆ గొంతులో అథారిటీ స్పష్టంగా వినిపించింది.

'ఐ డోన్ట్ నో.........' ఇంత వరకు అబద్ధం చెప్పలేదని సంతృప్తిపడ్డా.

నా బాగ్‌వైపు ఆ పాతసంచీవైపు అనుమానాస్పదంగా చూశాడు. ఆ సంచీలో యేమున్నాయి అస్థికలు ! సోదా చేస్తేమాత్రం యేంలే అనుకున్నాను. కాని వాళ్ల తీరుతెన్నులు నా వైపు చూసే పద్ధతి అంతా అసహ్యంగా వుంది. చిరాకుగా వుంది. నామీద



వాళ్ళకు అంత భారీయెత్తున అనుమానం కలగటానికి కారణం ఆ సూటుకేసేగా ! అది నాది కాదన్నాను అయిపోయింది. ఇంకా వాళ్లు నా సంగతి పట్టించుకోవటం యెందుకు? వాళ్ల అనుమానం తీరాలంటే ఆ పెట్టెలో యేముందో చూస్తేసరిపోలా! ఇట్లా అనుకుంటూనేవున్నా, వాళ్లు ఆ సూటుకేసును బలవంతంగా పగలకొట్టి మరీ తెరిచారు. మళ్ళీ ఆ ఫోటోలు నా కంట బడ్డాయి. 'సబ్ఇన్స్పెక్టరు' కళ్ళు జిగేలుమన్నాయి. నలుగురూ పోగయ్యారు వింతగా చూట్టానికి. పెట్టె లోంచి యేం బయటపడతాయో అని అంతా ఆదుర్దాగా చూస్తున్నారు. సిల్కు బ్లౌజులు, హెయిర్ పిన్నులు ఒక్కొక్కటే కింద పడేస్తున్నారు. ఓ చిన్న పర్సు కనిపించింది. ఆ పర్సును బలవంతంగా తెరిచేశాడు కానిస్టేబుల్. దాంట్లో ఓ వందరూపాయల నోటు మడతలుపెట్టి కుక్కేసినట్టుంది.

ఇంకా లోపల మడతల్లో యేం కనిపించిందో యేమొ సబ్ఇన్స్పెక్టరు కళ్ళు పెద్దవిచేసి మొహం గాండ్రింపుగా పెట్టి నావంక చూశాడు. అందర్నీ కసురుకుని వెళ్ళిపొమ్మన్నాడు. లేచి నిలబడ్డాడు. పోలీసుకు కనుసంజ్ఞ చేయగానే ఆ పెట్టెలో కిందపడేసినవన్నీ కూడేసి మూత గట్టిగా బిగించి చేతుల్లోకి తీసుకున్నాడు. 'ప్లీజ్ కం ఎలాంగ్ విత్ మీ' సబ్ఇన్స్పెక్టరు సాత్వికంగానే అన్నాడు.

నేనూ మెదలకుండా ఆయన వెనకాలే నా సంచీలు పట్టుకుని నడిచాను.

మీరు నాతో పోలీసు స్టేషనుకు రావాలి అన్నాడు హిందీ భాషలో.

ఈ సూటుకేసు నాది కాదు. ఎవరో అమ్మాయి నన్ను చూడమని యిచ్చి వెళ్ళిపోయింది అన్నాను అమాయకంగా.

అవన్నీ అక్కడ చెప్పొచ్చు...... మహా నిర్లక్ష్యంగా అన్నాడు.

నాకు చెడ్డ కోపం వచ్చేసింది. చప్పున ఆగిపోయాను. సబ్ ఇన్స్పెక్టరు కూడ ఆగి వెనక్కు తిరిగాడు.


ఎట్లా యిప్పుడు తప్పించుకోవటం, నేను ఆ సమయంలో యేం చెప్పినా ఆయన నమ్మే స్థితిలో లేడు. ఆయన డ్యూటీ ఆయన చేస్తున్నాడు. నిజానిజాలు తెలుసుకోవటానికి ప్రయత్నం చేస్తున్నాడు. నిందితురాలు తప్పించుకుపోవటం వలన నిర్దోషిని తీసుకు వెళ్ళుతున్నాడు. అంతే. ఆయన కెవరెవరో తెలీదు. ప్రతివాడు దోషో నిర్దోషో అని రుజువయ్యేటంత వరకు! కాని 'ప్రిన్సిపుల్' అదికాదే. అందరూ నిర్దోషులే, దోషి అని రుజువయ్యేనంతవరకు. కాని నాకు అంత వ్యవధి లేదు. తెల్లారితే పౌర్ణిమ. త్రివేణి సంగమంలో స్నానం చెయ్యాలి...ఇంకా చెయ్యాల్సినవి వున్నాయి. అసలు దాని కోసమే బయలుదేరింది. ఇవన్నీ సబ్ఇన్స్పెక్టరుకు చెప్పాల్సినవి కావు. చెప్పితే నమ్మడు కూడా. నా మనస్సు పరిపరివిధాల పోతోంది. నేను పెట్టుకున్న సూత్రాలు, నేను ఆచరించదల్చుకున్న విధులు నాకే అడ్డంవస్తూ వుంటాయి. నిజంగా నన్ను పరీక్ష చెయ్యటానికే యిలాంటి సంఘటనలు ఎదురవుతుంటాయనే మూఢనమ్మకంతో ఆదివరకు కొన్నింటిని తీవ్రంగా ఎదిరించాను. చివరికి నేనే గెల్చాను. ఒక్క రూపాయి లంచం యివ్వకుండా నా భూమి నేను స్వాధీనం చేసుకున్నాను. కొన్ని ఏళ్ళు పట్టింది. కొన్ని వందలు ఖర్చయినాయి. అయితే యేం నీతి నిజాయితీ నిలిచింది. ధర్మం గెలిచింది. ఇవన్నీ చాలా సంతృప్తి యిచ్చే వాక్యాలు. ఏమైనా నా మూఢత్వంలో నేనుండటంవలన యితరులకు ఏ బాధా కలగలేదు. ఇప్పుడు కూడా అంత

తింకంగానూ, దీని అంతు తేల్చుకుంటాను అని మొండిపట్టుదల పట్టటానికి వీల్లేదే !

ఫారెన్ గూడ్స్ స్మగిల్ చేశానని ఆయన ఆరోపణ. కళ్ళకు కనిపిస్తున్న రెండు ఫారెన్ రిస్ట్‌వాచెస్, ఆ సూటు కేసులోంచి తీసినవే ! దానికి నేను బాధ్యత వహించాలి. ఆ సబ్ ఇన్స్పెక్టరుతో స్నేహం చేసుకోవ టానికి ప్రయత్నం చేశా. ఆయన లొంగినట్లే కనిపించి మళ్ళీ కట్టెయ్య బోతున్నాడు. నేను ఖచ్చితంగా చెప్పేశాను. ఇప్పుడు ఎమర్జెన్సీ లేదు. నువ్వు ఒప్పుకుంటే మనం మనం సర్దు బాటు చేసుకోవచ్చు అని. ఆయనకు అర్థంఅయినా అర్థంకానట్టుగానే మాట్లాడు తున్నాడు.

నా ప్రిన్సిపుల్స్‌కు తిలోదకాలు యిచ్చే శాను. ఇది నాకోసం కాదు. మానాన్న కోసం. ఆయన ఆత్మశాంతికి ! దీంట్లో నా స్వార్థంలేదు. ఇది నా సమర్థన కాకపోతే ఆ సబ్ఇన్స్పెక్టరు అంతు తేల్చుకునేవాణ్ణి. ఇద్దరం అంగీకారానికి వచ్చేశాం. ఆయన నామీద యే విధ మైన కేసు లేకుండా చేసేటట్టు. ఆ సూటుకేసు ఆ రిస్ట్ వాచెస్ వగైరాలు ఆయనే తీసుకువెళ్లేటట్టు ! నేను సూటిగా అలహాబాద్ వెళ్లటానికి అనుమతించేటట్టు! దానికిగాను నేను యేం చెయ్యాలో, యేమి చెయ్యగూడదనుకున్నానో అది చేశేటట్టు! నా చేత నా అంతరాత్మకు విరుద్ధంగా అంత పని చేయించేశాడు. డబ్బు పోయినందుకుగాదు! నేనివ్వాల్సిన తీరు చూస్తూంటే నాకు మతిపోయిన ట్లనిపించింది.

రానే వచ్చింది కాశీ ఎక్స్‌ప్రెస్. ఆ




సబ్ఇన్స్పెక్టరు నాకు యెంతో ఉపకార చేశాడు. పితృ కార్యానికి అవ రోధాలు తొలిగించే ఆయన్ను స్వర్గానికి పంపాడు ! అదే పదివేలు. గబగబా రైలు దగ్గరకు నడుస్తున్నాను. ఆ 'సబ్ ఇన్స్పెక్టరు వంక, కానిస్టేబుల్ వంక చూస్తూ, రైల్లోకి ఎక్కాను. వాళ్ళిద్దరూ దూరంగా కనిపిస్తున్నారు. వాళ్ల వాలకం ఆ నవ్వులు ఆ పకపకలు చూస్తూంటే, నాకు అనుమానం వేసింది. వాళ్లసలు పోలీసు వాళ్లేనా అని సందేహం తీవ్రంగా కలిగింది. వాళ్ళు పోలీసు శాఖకు సంబంధించిన వాళ్ళు కారు అని అంత రాత్మ ఘోషించినట్లనిపించింది. మహా కసి వచ్చేసింది. తామసం పెరిగింది. కోపం అంతకంటే ఉధృతంగా ఆవహించింది.

రైలుపెట్టెలోంచి అమాంతం దూకి వాళ్లమీద పడదామన్నంతా ఆవే శంతో గభాలున ఒక మెట్టు దిగాను. వాళ్ళు కనిపెట్టినట్టున్నారు. గబగబ పరుగెత్తుతున్నారు. యింకో మెట్టుమీద కాలు పెట్టంగానే ఇంజను కెవ్వున కేక పెట్టింది. చప్పున లోపలికి వెళ్లాను. కాళ్లూచేతులు వణికిపోతున్నాయి. నా బాధ డబ్బుపోయినందుకు కాదు. మోసపోయి నందుకు కాదు. నా అంతరాత్మకు వ్యతి రేకంగా చెయ్యాల్సి వచ్చినందుకు ! రైలు ప్లాట్‌ఫారం దాటేటంతవరకు కళ్ళువిప్పి మరీ చూస్తూ నిలబడ్డాను. వాళ్ళు ఎప్పుడో వెళ్ళిపోయి వుంటారు !

రైలు స్పీడు అందుకుంది. గాలి విసురున కొట్టేస్తోంది. ఎవరా పోలీసు వేషధారి ! ఆ అమ్మాయెవరు ! నేను యెక్కడి వాణ్ణి ! మేం ముగ్గురం యిక్కడ కలవటం యేమిటి ! తలుచు కుంటుంటే ఆశ్చర్యంగా వుంది. మెల్లిగా వెనక్కు తిరిగి కూర్చోవటానికి సీటు కోసం చూస్తున్నాను.

'వే రీజ్ మై సూట్‌కేస్ !......' చెమటలు తుడుచుకుంటూ, రొప్పుతూ, ఆయాసపడుతూ, ఆదుర్దాగా నన్ను నిలవేసి అడిగింది ఆ అమ్మాయి !